# ఖమేనీ అంతిమయాత్ర దారుల్లో అమెరికా దాడులు

**●టెహ్రాన్–మషద్ రైల్వే ట్రాక్,వంతెనలు ధ్వంసం ●దాడులతో దద్దరిల్లిన ఇరాన్ ●తీర ప్రాంతం ఎనిమిది ఇరాన్ క్షిపణులు కూల్చేసిన జోర్డాన్ ●హోర్ముజ్‌లో అన్నిరకాల రాకపోకలూ స్తంభింపజేస్తాం: ఇరాన్ ●ఖతార్, బహ్రైన్, కువైట్‌లో అమెరికా స్థావరాలపై ఇరాన్ దాడులు**

**దుబాయ్:** ఇరాన్‌తో కుదిరిన తాత్కాలిక ఎంఓయును రద్దుచేసినట్లు ట్రంప్ ప్రకటించిన తర్వాత వరుసగా రెండోరోజు గురువారం కూడా ఇరాన్ తీర ప్రాంతాలపై అమెరికా సైనిక దళాలు విరుచుకుపడ్డాయి. అమరుడైన ఇస్లామిక్ విప్లవ యోధుడు అలీ ఖమేనీ, ఆయన కుటుంబీకుల పార్థివదేహాలను సమాధి చేసేందుకు సిద్ధమైన మషద్‌కు వెళ్ళే దారులపై అమెరికా సైన్యం గగనతల దాడులు చేసింది. మషద్‌కు వెళ్ళే మార్గంలో రెండు వంతెనలను కూల్చివేసింది. పోర్ట్ కంట్రోల్ టవర్‌ను ధ్వంసం చేసింది. టెహ్రాన్–మషద్ మధ్య రైల్వే ట్రాక్‌ను అమెరికా డ్రోన్లు ధ్వంసం చేశాయి దీంతో మషద్ వెళ్ళే రైళ్ళ రాకపోకలను ఇరాన్ ప్రభుత్వం నిలిపివేసింది. ఈ దాడులను శత్రువులు చేసిన నేరపూరిత చర్యగా పేర్కొంది. అదే విధంగా ఇరాన్ ప్రయోగించిన ఎనిమిది క్షిపణులను తాము కూల్చివేశామని జోర్డాన్ ప్రభుత్వం ప్రకటించింది. గడచిన 48 గంటలుగా అమెరికా చేసిన దాడులలో 14 మంది ఐఆర్‌జిసి సైనికులు మరణించగా, మరో 78 మంది గాయపడినట్లు ఇరాన్ ఆరోగ్యమంత్రిత్వశాఖ ప్రకటించింది. హోర్ముజ్ జలసంధిలో అన్ని రకాల రాకపోకలను స్తంభింపజేస్తామని ఇరాన్ పాలకులు ప్రకటించారు. తెలిసిన గణాంకాల ప్రకారం జలసంధిలో 6000 మంది నావికులు వివిధ నౌకలలో స్తంభించిపోయారు. దాదాపు 20కి పైగా నౌకలు జలసంధిని దాటలేక వెనక్కి వెళ్ళిపోయాయి. ఈ పరిస్థితుల్లో పశ్చిమాసియా యుద్ధం ప్రపంచ వాణిజ్యంపై, చమురు మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపించింది. ఇరాన్‌లో 90 లక్ష్యాలపై ఈ రోజులు దాడులు పూర్తిచేసినట్లు సెంట్‌కామ్ ప్రకటించింది. దీంతో రెండు రోజుల్లో ఇరాన్‌లో ఉన్న 175 లక్ష్యాలపై అమెరికా దాడులు చేసినట్లయింది. అదేవిధంగా ఇరాన్ కూడా ఖతార్, బహ్రైన్, కువైట్ దేశాల్లో ఉన్న అమెరికా స్థావరాలపై ఉద్ధృత దాడులు కొనసాగించింది. జోర్డాన్‌లో అమెరికా వైమానిక స్థావరంపై 10 క్షిపణులతో దాడి చేసినట్లు ఐఆర్‌జిసి ప్రకటించింది. గల్ఫ్ ప్రాంతంలో ఉన్న ఏ ఒక్క అమెరికా స్థావరం తమ దాడుల నుండి తప్పించుకోలేదని,ఒక్క ఎయిర్‌బేస్ కూడా ఇకమీదట సురక్షితంగా ఉండబోదని ఐ ఆర్‌జిసి హెచ్చరించింది. జోర్డాన్ గగనతలంలో ఇరాన్ ప్రయోగించిన క్షిపణులు కనిపించాయని, ఎనిమిది క్షిపణలను తాము కూల్చివేశామని ఆ దేశ ప్రభుత్వ ప్రతినిధి చెప్పారు. పలుచోట్ల శకలాలు పడ్డాయన్నారు. బుషెర్ లో ఇరాన్‌కు ఉన్న ఏకైక పౌర అణువిద్యుత్ ఉత్పత్తి కేంద్రం సమీపంలో అమెరికా ప్రయోగించిన క్షిపణులు పడ్డాయని ఇరాన్ ఐఆర్‌జిసి పేర్కొంది. మీరు ఒకసారి చేస్తే మేం రెండు సార్లు దాడిచేస్తామని హెచ్చరించింది. హోర్ముజ్ జలసంధిలో అమాయక వాణిజ్య నౌకలపై దాడులు మరింతగా కొనసాగితే ఇరాన్ పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారుతుందని ట్రంప్ హెచ్చరిక చేశారు.గురువారం తెల్లవారకముందే మరోసారి ఇరాన్‌పై దాడులు చేస్తామని ట్రంప్ ముందే ప్రకటించిన విధంగా దక్షిణ ప్రాంతంలో అమెరికా విమానాలు, డ్రోన్లు విరుచుకుపడ్డాయి. కాగా కువైట్,బహ్రైన్‌లలో ఇరాన్ దాడులను సౌదీఅరేబియా విదేశీమంత్రి,రాజు ఫైజల్ బిన్ ఫర్హాన్ తీవ్రంగా వ్యతిరేకించారు. కువైట్‌రాజు,విదేశీమంత్రి షేక్ జెర్రాహ్ జబర్ అల్–అహ్మద్ అల్–సభాతో ఫోన్‌లో సంభాషించారు. ఇరాన్ నీచమైన దాడులకు పాల్పడుతోందని ఫర్హాన్ విమర్శించారు. ఈ ఉద్రిక్తతలను అదుపుచేసి శాంతి, భద్రతా సుస్థిరతలు సాధించాల్సిన అవసరం ఉందని నాయకులు ఇద్దరూ ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు. ఖతార్ ప్రధానమంత్రి,విదేశీమంత్రి షేక్ మహ్మద్ బిన్ అబ్దుల్ రెహ్మాన్ అల్ థానీతో కూడా ఫర్హాన్ విడిగా ఫోన్ లో సంభాషించారు. గల్ఫ్‌లో తాజా పరిణామాలు,యుద్ధ విస్తృతిపై చర్చించారు.కాగా తాజా యుద్ధ పరిణామాలపై ఫ్రాన్స్ విదేశాంగమంత్రి జీన్–నోయల్ బారోట్ గురువారం మాట్లాడుతూ, ఈ దాడులను ఇరాన్ తనకుతానుగా తెచ్చిపెట్టుకుందని విమర్శించారు. హోర్ముజ్‌లో మంగళవారంనాడు మూడు చమురు ట్యాంకర్లపై దాడులు చేయకుండా ఉంటే ఈ యుద్ధం వచ్చేదేకాదన్నారు. ఒప్పందాన్ని ఉల్లంఘించడం ద్వారా ఇరాన్ ఈ యుద్ధాన్ని తనే తెచ్చిపెట్టుకుందని విమర్శించారు.



**వాళ్ళు ఫోన్ చేశారు: ఒప్పందం కావాలంటున్నారు**
**ఒకరకంగా వాళ్ళు పిచ్చివాళ్ళు: ట్రంప్**

"వాళ్ళు" (ఇరాన్ పాలకులు) కొద్ది సేపటిక్రితం నాకు ఫోన్ చేశారు, ఒప్పందం కావాలంటున్నారు, కానీ నాకు సందేహంగా ఉంది, వారి విశ్వసనీయత మీద గౌరవం లేదు" అని డోనాల్డ్ ట్రంప్ అన్నారు. టర్కీ నగరం అంకారాలో నాటో సదస్సు తర్వాత అమెరికాకు తిరిగి వెళుతూ విమానంలో పాత్రికేయులతో ఆయన మాట్లాడారు. "కొద్ది సేపటిక్రితం వాళ్ళు ఫోన్ చేశారు. వారు ఒప్పందాన్ని బలంగా కోరుకుంటున్నారు, కానీ వారు ఆ ఒప్పందానికి అర్హులో కాదో నాకు తెలియదు,ఆ ఒప్పందాన్ని గౌరవిస్తారో లేదో కూడా తెలియదు, అదే పెద్ద సమస్య" అన్నారు. పాత్రికేయులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానాలు చెప్పారు.
వారు ఒకసారి దాడి చేస్తే మేం దానికి ప్రతిగా 20 సార్లు దాడి చేశాం, 1:20 నిష్పత్తిలో మా దాడులు కొనసాగాయి, మేం వాళ్ళని చాలా బలంగా దెబ్బ కొట్టాం,వారు దాడి చేసిన ప్రతిసారీ ఇదే నిష్పత్తిలో వారిని దెబ్బకొడతాం, నిన్న కూడా అదే చేశాం. నిజం చెప్పాలంటే ఒకరకంగా వాళ్ళు పిచ్చివాళ్ళు, కానీ కాస్త అదుపు తప్పారంతే, అమెరికాతో ఒప్పందం చేసుకోవాలని చాలా బలంగా కోరుకుంటున్నారు, కానీ ఇదేవిధంగా దాడులు చేస్తే చాలా దారుణంగా నష్టపోతారు" అని పాత్రికేయులకు ట్రంప్ చెప్పారు.


## ఖమేనీ ఖననం




**టెహ్రాన్:** అమరుడైన ఇరాన్ ఇస్లామిక్ విప్లవ నాయకుడు ఖమేనీ అంత్యక్రియలు మషద్‌లో గురువారం రాత్రి పూర్తయ్యాయి. ఆయనతోపాటు ఆయన కుటుంబ సభ్యులను కూడా ఖననం చేశారు. లక్షలమంది ప్రజల సమక్షంలో, తుదివీడ్కోలు ఇచ్చి ప్రార్థనలు చేసి వారిని సమాధి చేశారు. జులై 4వ తేదీ నుండీ ప్రారంభమైన అంత్యక్రియల ప్రక్రియ తర్వాత ఇరాక్ సహా ఐదు నగరాలలో అంతిమ యాత్ర కొనసాగింది. ఖమేనీ జన్మస్థలం, పవిత్ర నగరం మషద్‌లో బంగారుగోపురం ఉన్న ఇమామ్ రెజా మందిరంవైపు వెళ్ళే వీధులన్నీ లక్షలమందితో నిండిపోయాయి. ఖమేనీతోపాటు ఆయన భార్య, కుమార్తె, అల్లుడు, మనుమరాలు మృతదేహాలను కూడా సమాధి చేశారు. దీంతో ప్రజా సంతాప దినాలు కూడా ముగిశాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 28న అమెరికా–ఇజ్రాయెల్ చేసిన ఉమ్మడి గగనతల దాడుల్లో ఖమేనీ మరణించారు. అప్పటినుండి యుద్ధం కొనసాగడంతో వారి పార్థివదేహాలను దాచి ఉంచారు. ఈ అంత్యక్రియల్లో ఖమేనీ వారసుడుగా ఇరాన్ బాధ్యతలు తీసుకున్న సర్వాధినేత మొజ్తాబా ఖమేనీ మాత్రం పాల్గొనలేదు. మిగిలిన ముగ్గురు కుమారులు పాల్గొన్నారు. మొజ్తాబా ఖమేనీ ఒక రహస్య ప్రాంతంలో ఇంకా చికిత్స పొందుతూ విశ్రాంతి తీసుకుంటున్నారు. అక్కడి నుండే ప్రభుత్వ కార్యకలాపాలకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. కాగా, ఎంతోమంది పాలక విధేయులు ఇరాన్ జెండాలు, ఫోటోలు, బ్యానర్లు పట్టుకుని నినాదాలు చేశారు. 'డోనాల్డ్ ట్రంప్‌ను చంపుతాం' అని అంత్యక్రియల సందర్భంగా సర్వత్రా భారీ సంఖ్యలో బ్యానర్లు ఎక్కడపడితే అక్కడ కనిపించాయి. గడచిన ఆరురోజులుగా లక్షలమంది ప్రజలు ఖమేనీ, ఆయన కుటుంబ సభ్యుల పార్థివ దేహాలకు నివాళులు అర్పించి అంతిమ ప్రార్థనలు చేసిన సందర్భంగా ప్రతి నగరంలో, ప్రతిచోటా 'మేం ట్రంప్‌ని చంపుతాం', 'ట్రంప్‌కు ఉరిశిక్ష విధించాలి', 'కిల్ ట్రంప్' అనే బ్యానర్లు ప్రతిచోటా కనిపిస్తూ వచ్చాయి. 'మేం ట్రంప్‌ను చంపుతాం' అని రాసి ఉన్న పెద్ద పెద్ద బ్యానర్లు అనేక బహుళ అంతస్తుల భవంతులపై కనిపిస్తున్నాయి.

## మీ బెదిరింపులకు కాలం చెల్లింది: ఘాలిబాఫ్

**మీకోసం హోర్ముజ్ జలసంధి తెరుచుకోదు**



**టెహ్రాన్:** పదే పదే చేస్తున్న బెదిరింపులు, వాగ్దానాల ఉల్లంఘనలకు తీవ్ర మూల్యం చెల్లించక తప్పదని, మీరు బెదిరించినంతమాత్రాన హోర్ముజ్ జలసంధి మీకోసం తెరుచుకోదని ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మహమ్మద్ బఘేర్ ఘాలిబాఫ్ హెచ్చరిక చేశారు. మీ బెదిరింపులకు ఇక కాలం చెల్లిందని పేర్కొన్నారు. ట్రంప్ పదే పదే బెదిరింపులు చేయడంతోపాటు, ఇస్లామాబాద్ ఒప్పందాన్ని (జూన్ 17,18 నాటి ఎంఓయు) ఉల్లంఘించడం వారి నైజాన్ని తెలియజేస్తోందని, దానికి వారు మూల్యం చెల్లించక తప్పదని గురువారం తెల్లవారుజామున ఎక్స్ వేదికగా పోస్టింగ్ రాశారు."మీరు మమ్మల్ని బెదిరిస్తే హోర్ముజ్ జలసంధి తెరుచుకోదు, ఇరాన్ విధించిన షరతులకు అనుగుణంగా, ఇరాన్ చెప్పినవిధంగా హోర్ముజ్ జలసంధి అంతర్జాతీయ వాణిజ్య నౌకల రాకపోకలకు తెరచుకుంటుంది" అని పేర్కొన్నారు. "బెదిరింపులకు, వాగ్దాన భంగాలకు ఇకపై మూల్యం చెల్లించుకోకతప్పదనే విషయంలో అమెరికా ఇంకా గుణపాఠాలు నేర్చుకోలేదు,నేను చాలా స్పష్టంగా చెబుతున్నాను, మీరు దాడి చేస్తే మేం ఎదురుదాడి చేస్తాం, రెట్టింపు దాడులు చేస్తాం, ప్రతిఒక్కసారీ చేసే దాడికి రెండేసిసార్లు దాడులు జరుగుతూ ఉంటాయి, వ్యర్థ ప్రయత్నాలు చేయవద్దు,అలాంటి ప్రయత్నాలు మిమ్మల్ని మరింత లోతుల్లోకి ముంచేస్తాయి, హోర్ముజ్ జలసంధి ఇరాన్ విధించిన షరతుల ప్రకారం తెరచి ఉంటుంది, అమెరికా చేసే బెదిరింపుల ప్రకారం కాదు" అని తన పోస్టింగ్‌లో రాశారు. ఇస్లామాబాద్ ఒప్పందాన్ని ఉల్లంఘించిన అమెరికా గురువారం తెల్లారుజామున వరుగా రెండోరోజు కూడా ఇరాన్‌పై దాడులు చేయడంతో ఈ రెండు దేశాలమధ్యా వివాదం ముదిరి పాకాన పడింది.జూన్ 17న ఎ ఒంయుపై సంతకాలు జరిగినప్పటి నుండీ దొంగదారుల్లో వెళుతున్న ఐదు నౌకలపై ఇరాన్ దాడి చేసింది.

### ఉక్రేన్‌కు పేట్రియాట్రిక్ రక్షణహామీతో

## రష్యా వ్యాప్తంగా దాడులు: చమురు ట్యాంకర్లు దగ్ధం

**చమురు సంక్షోభంతో పుతిన్ ఎమర్జెన్సీ దిగుమతులు**

**కీవ్:** ఉక్రేన్‌కు పేట్రియాట్రిక్ క్షిపణులు తయారు చేసుకోవడానికి, సంబంధిత గగనతల రక్షణ వ్యవస్థను సమకూర్చుకోవడానికి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నాటో సదస్సు సందర్భంగా అంకారాలో జెలెన్స్కీకి అంగీకారం తెలియజేశారు. దీంతో ఆ మరునాడు గురువారం ఉక్రేన్ సైన్యం రెచ్చిపోయి రష్యాపై తీవ్రస్థాయిలో దాడులను ఉద్ధృతం చేసింది. మరిన్ని చమురు కేంద్రాలపై డ్రోన్ దాడులు చేసింది. అజోవ్ సముద్రంలో ఉన్న రెండు రష్యా చమురు ట్యాంకర్లకు కూడా ఉక్రేన్ డ్రోన్లు నిప్పుపెట్టి దగ్ధం చేశాయి. ఇతర సంబంధిత వ్యవస్థలపై దాడులతో మౌలిక సదుపాయాలను ధ్వంసం చేశాయి. గురువారం తెల్లవారుజామున రష్యా దక్షిణ ప్రాంత ట్వెర్ నగరంలో చమురు డిపోను ఉక్రేన్ డ్రోన్లు ధ్వంసం చేయడంతో మంటలు చెలరేగాయని ప్రాంతీయ గవర్నర్ విటాలీ కోరోల్యోవ్ చెప్పారు. బుధవారం రాత్రి నుండి గురువారం తెల్లారేవరకూ 73 ఉక్రేన్ డ్రోన్‌లను కూల్చివేసినట్లు రష్యా సైన్యం ప్రకటించింది.సముద్రంలో ఉన్న రెండు ట్యాంకర్లను ఉక్రేన్ డ్రోన్లు దగ్ధం చేశాయని రోస్టోవ్ గవర్నర్ యూరీ స్లుసార్ చెప్పారు. వీటిల్లో ఒక ఓడ ఇంకా మండుతూనే ఉందని చెప్పారు. రష్యా కూడా 94 దీర్ఘశ్రేణి డ్రోన్లు, రెండు క్షిపణులను ప్రయోగించిందని ఉక్రేన్ ప్రకటించింది. రష్యా ఆక్రమణలో ఉన్న క్రిమియా ప్రాంతానికి చమురు సరఫరా జరగకుండా అడ్డుకునేందుకు ఇటీవలి కాలంలో ఉక్రేన్ భారీస్థాయిలో డ్రోన్ దాడులు చేస్తోంది. సైబీరియాలో ఉన్న కీలకమైన చమురు రిఫైనరీ కేంద్రంపై ఉక్రేన్ గడచిన మంగళవారం దాడులు చేయడంతో అసాధారణస్థాయిలో నష్టపోయిన రష్యాలో చమురు సంక్షోభం తలెత్తింది. ప్రజలు అనేక కేంద్రావల్ల తమ వాహనాలను నింపుపోవడానికి గంటల తరబడి వేచిచూస్తున్నారు. దీంతో రష్యా ప్రభుత్వం ఎమర్జెన్సీ ప్రాతిపదికపై చమురు దిగుమతులు ప్రారంభించింది. జులై నెలాఖరు వరకూ దేశం నుండి డీజిల్ ఎగుమతులను నిషేధించింది. దీంతో ఆ దేశంలో డీజిలు ధరలు రికార్డుస్థాయిలో పెరిగిపోయాయి.

**యుద్ధం పెరిగితే పరిష్కారం రాదు**
**అదంతా ట్రంప్ అపోహ: ద్మిత్రీ పెస్కోవ్**

ఉక్రేన్–రష్యా మధ్య యుద్ధం పెరిగితే తొందరగా సమస్యకు పరిష్కారం లభిస్తుందని డోనాల్డ్ ట్రంప్ సూచించడం కేవలం ఆయన అపోహ మాత్రమేనని రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రెస్ కార్యదర్శి ద్మిత్రీ పెస్కోవ్ గురువారం మాస్కోలో విమర్శించారు. ఉక్రేన్ గగనతలాన్నిమూసివేయాలనేది కొత్త ప్రతిపాదన అనీ, ఇదంతా నాటో సభ్యదేశాల సాయుధ దళాల ప్రత్యక్ష కార్యాచరణను సూచిస్తోందన్నారు. ఒకవైపు ఉక్రేన్‌కు అమెరికా ఆయుధాలు అందిస్తూ, మరోవైపు శాంతికి కట్టుబడి ఉన్నామని చెప్పడం వారి ద్వంద్వవైఖరికి తార్కాణమని విమర్శించారు.

## పథకాలు చివరి లబ్ధిదారుడి వరకూ చేరాలి

**ప్రతి రంగంలో నాణ్యత, పారదర్శకత, సాంకేతికతకు ప్రాధాన్యం ఇవ్వాలి**
**రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా**




**ప్రజాపక్షం/హనుమకొండ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేసి వాటి ప్రయోజనాలు చివరి లబ్ధిదారుని వరకు చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు.గురువారం హనుమకొండ కలెక్టరేట్‌లో హనుమకొండ, వరంగల్ జిల్లాల అధికారులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై రాష్ట్ర గవర్నర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. అనంతరం వందేమాతరం, తెలంగాణ రాష్ట్ర గీతం ఆలపించారు.ఈ సమావేశంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కె.ఆర్. నాగరాజు, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.సమావేశంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల చారిత్రక నేపథ్యం, అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, వైద్య–ఆరోగ్య సేవలు, వ్యవసాయం, మౌలిక వసతులు, ఇతర కీలక అంశాలపై జిల్లా కలెక్టర్లు చాహత్ బాజ్ పాయి, డాక్టర్ సత్య శారద పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గవర్నర్‌కు వివరించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో చేపడుతు న్న భద్రత తదితర చర్యలను పోలీస్ కమిషనర్ శ్వేత వివరించారు. సమీక్ష సందర్భం గా టిబి ముక్త్ భారత్ కార్యక్రమం అమలు, టిబి బాధితులకు అందిస్తున్న వైద్య సేవలు, స్క్రీనింగ్ క్యాంపులు, ఇందిరమ్మ ఇండ్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం, పల్స్ పోలియో కార్యక్రమం అమలు తీరుపై గవర్నర్ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ మాట్లాడుతూ టీబీ నిర్మూలనకు మరింత పటిష్ట చర్యలు చేపట్టాలని, విస్తృత స్థాయిలో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి వ్యాధి నియంత్రణకు కృషి చేయాలని సూచించారు. పల్స్ పోలియో కార్యక్రమం వంద శాతం లక్ష్యంతో అమలయ్యేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. విద్య, ఆరోగ్యం, వ్యవసాయం రంగాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్న గవర్నర్, ఈ ప్రాంతం పత్తి సాగుకు ప్రసిద్ధి చెందినందున రైతులను అధిక ఆదాయం వచ్చే పంటల సాగు, విలువ ఆధారిత వ్యవసాయం వైపు ప్రోత్సహించాలని సూచించారు.పాలనలో పారదర్శకత అత్యంత కీలకమని, పారదర్శక వ్యవస్థ వల్ల ప్రజలకు, రైతులకు, ప్రభుత్వానికి సమానంగా ప్రయోజనం కలుగుతుందని అన్నారు. ప్రస్తుతం ప్రపంచం కృత్రిమ మేధస్సు యుగంలోకి అడుగుపెట్టిందని పేర్కొంటూ, ఏఐ అనేక రంగాల్లో విప్లవాత్మక మార్పులకు దారి తీస్తోందన్నారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ,హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో అధికారులు సమన్వయంతో పనిచేయడం అభినందనీయమని అన్నారు.వర్షాకాలంలో సంక్షేమ హాస్టళ్లలో నివసిస్తున్న విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, పరిశుభ్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా చర్యలు చేపట్టాలని ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చివరి లబ్ధిదారునికి చేరే లా అధికారులు బాధ్యతతో పనిచేసి, హనుమకొండ, వరంగల్ జిల్లాలను అన్ని రంగాల్లో ఆదర్శ జిల్లాలుగా తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు.ఈ సమీక్షా సమావేశంలో హనుమకొండ జిల్లాల ఆదనవు కలెక్టర్లు రవి సంధ్యారాణి, వరంగల్ డీసీపీ ధారా కవిత, హనుమకొండ, వరంగల్ జిల్లాలకు చెందిన వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు

## చైనా 'షూ రాజధాని'లో భారీ అగ్ని ప్రమాదం

**●28 మంది మృతి: అనేక మంది గల్లంతు ●తక్షణ సహాయ చర్యలకు జిన్‌పింగ్ పిలుపు ●బాధ్యులను గుర్తించి కఠినంగా శిక్షించాలని ఆదేశం**



**బీజింగ్:** చైనాలోనే అతిపెద్ద దైన షూ ఫ్యాక్టరీలో గురువారం జరిగి న భారీ అగ్ని ప్రమాదంలో 28 మంది మరణించారు. అనేకమంది గల్లంతయ్యారు. వీరిలో కార్మికు లు, సామాన్య ప్రజలు కూడా ఉ న్నారు. వారికోసం తీవ్రంగా గాలిస్తున్నారు. తూర్పు చైనాలోని పుజియాన్ రాష్ట్రం క్వాన్‌జౌ పరిధిలో ఉన్న జిన్‌జియాంగ్ నగరంలో ఉ న్న షూ ఫ్యాక్టరీలో ఈ అగ్ని ప్రమాదం సంభవించింది. ఐతే మృతులసంఖ్య ఇంకా పెరిగే ప్ర మాదం ఉందని భయపడుతున్నారు. యావత్ ప్రపంచ క్రీడారంగానికీ ఇక్కడి నుండే బూట్లు, ఇతర అనుబంధ సామాగ్రి సరఫరా అవుతా యి. 35 అగ్నిమాపక వాహనాలు, 183 మంది అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేస్తున్నారు. అగ్ని ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణం తెలియరాలేదు.
ఈ ప్రాంతం పాదరక్షల తయారీ కర్మాగారాలకు,సంబంధిత అనుబంధ సంస్థలకు ఒక పెద్ద హబ్‌గా పరిఢవిల్లుతోంది. ఈ ప్రాంతంలో 7,000 పాదరక్షల తయారీ కర్మాగారాలు, ఉత్పత్తి సంస్థలు, అనుబంధ కేంద్రాలు ఉన్నాయి. ఇది ఒక సంపూర్ణమైన పారిశ్రామిక గొలుసుకట్టు కేంద్రం. అతిపెద్ద సరఫరా వ్యవస్థ ఈ ప్రాంతంలో అభివృద్ధి చెందింది. చైనాలో ఇది అతిపెద్ద షూ కర్మాగారం కావడంతో దీనిని చైనా షూ రాజధాని"గా ప్రజలు పిలుస్తారు. 2024లో ఈ షూ రాజధాని 36.74 బిలియన్ డాలర్ల వార్షిక ఉత్పత్తులను నమోదు చేసింది. ఇందకలో వార్షిక క్రీడా బూట్ల ఉత్పత్తి 1.2 బిలియన్ జతలను అధిగమించింది. ఇది ప్రపంచ ఉత్పత్తిలో 20 శాతానికి సమానం.
సిసిటివి న్యూస్ సమాచారం ప్రకారం, మంటలను ఆర్పడానికి అన్నివనరులను సమీకరించాలని,మృతులను వెంటనే ధృవీకరించాలని, సజీవులను కాపాండేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని,గాయపడినవారికి తక్షణ వైద్యచికిత్సలు అందించాలని చైనా అత్యవసర నిర్వహణా మంత్రిత్వశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఐతే ఈ ఫ్యాక్టరీ భవనానికి ఉన్న మెట్ల మార్గాన్ని ఎవరూ ఉపయోగించడంలేదు. అందరూ లిఫ్టులనే ఉపయోగిస్తున్నారు. దీంతో మెట్ల మార్గంలో భారీ ఎత్తున చెత్తాచెదారం పేరుకుపోయి ఎవరూ నడవడానికి అవకాశంలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో అగ్నిమాపక సిబ్బంది పైకి వెళ్ళడానికి వీలు కాలేదు. అదేవిధంగా బాధితులు కూడా మెట్లమార్గంలో కిందకు వచ్చే అవకాశాలు ఉండకపోవచ్చు. దీంతో సమస్యలు ఏర్పడ్డాయి.
ప్రభుత్వ వార్తాసంస్థ ప్రచురించిన ఫూటేజీలో ఒక పెద్ద భవంతి నుండి భారీగా దట్టమైన పొగలు,మంటలు ఎగసి పడటం కనిపించింది. భారీ ప్రాణనష్టం జరిగి ఉంటుందని అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ ఆందోళన వ్యక్తం చేశారు. అగ్ని ప్రమాదం నేపథ్యంలో ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారని జిన్హువా వార్తాసంస్థ తెలియజేసింది. ఈ ప్రమాదాన్ని నివారించేందుకు, బాధితులను కాపాడేందుకు,మృతుల కుటుంబాలకు పూర్తి భరోసా ఇచ్చేందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాలని ఆయన అధికారులను కోరారు. ఫ్యాక్టరీలో అన్ని మూలలా గాలింపు చర్యలు చేపట్టాలని, పూర్తిస్థాయిలో సహాయ చర్యలు కొనసాగించాలని, అన్నింటికంటే ముఖ్యంగా ప్రమాదానికి గల కారణాలను గుర్తించాలని,ఈ ఘటనకు బాధ్యులను కఠినంగా జవాబుదారీ చేయాలని జిన్‌పింగ్ ఆదేశాలు జారీ చేశారు.

## తెలంగాణ ఆతిథ్యం (మొదటి పేజీ తరువాయి)

**ఇవ్వనున్నట్లు వెల్లడించింది.** :యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ వర్సిటీ ప్రారంభోత్సవం అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో సమగ్ర క్రీడా విధానం లేకపోవడం వల్ల భారత్ ఒలింపిక్స్‌లో ఆశించిన స్థాయిలో రాణించ లేకపోయిందన్నారు. పిటి ఉష వంటి కొద్దిమంది క్రీడాకారులు మాత్రమే దేశానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చారని పేర్కొన్నారు. క్రీడలకు సమగ్ర ప్రాధాన్యం కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక క్రీడా విధానాన్ని రూపొందించి, పబ్లిక్‌ప్రైవేట్ భాగస్వామ్యంతో యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసిందన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారికి ఉద్యోగాలు, నగదు ప్రోత్సాహకాలు అందిస్తూ ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా నిలుస్తుందని తెలిపారు. లక్ష్యాలను సాధించాలంటే వంద శాతం కృషి అవసరమని, రాబోయే రోజుల్లో తెలంగాణను ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇచ్చే స్థాయికి తీసుకెళ్లే దిశగా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందన్నారు. పిటి ఉష మాట్లాడుతూ భారతదేశంలో బలమైన క్రీడా సంస్కృతిని నిర్మించే దిశగా తెలంగాణ ప్రభుత్వం యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. క్రీడాకారుల విజయానికి కోచ్‌లు, శిక్షణ, క్రీడా విజ్ఞానం, వైద్య సహాయం, సంస్థాగత మద్దతు కీలకమని పేర్కొన్నారు. భౌతిక విద్య, పారా క్రీడలు, క్రీడా పరిశోధన, కోచ్‌లు, ట్రైనర్లు, స్పోర్ట్స్ సైంటిస్టులను తీర్చిదిద్దడంపై ప్రత్యేక దృష్టి పెట్టడం సంతోషకరమన్నారు. ఈ విశ్వవిద్యాలయం దేశంలో ప్రముఖ క్రీడా విద్యా, అథ్లెటిక్ అభివృద్ధి కేంద్రంగా ఎదగాలని ఆకాంక్షించారు. రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, క్రీడా దిగ్గజం పిటి ఉష తెలంగాణకు రావడం గర్వకారణమన్నారు. విద్యార్థులు సోషల్ మీడియా ప్రచారం కంటే ఆటపై దృష్టి సారించి క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు జితేందర్ రెడ్డి, భారత బ్యాడ్మింటన్ ప్రధాన కోచ్ పుల్లెల గోపీచంద్, వైఐపిఇఎస్‌యు వైస్ చాన్సలర్ డాక్టర్ జి. కిషోర్, ఎస్ఎటిజి చైర్మన్ శివసేనా రెడ్డి, ప్రముఖ క్రీడాకారులు, ద్రోణాచార్య, అర్జున అవార్డు గ్రహీతలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## బకాయిలు
**(మొదటి పేజీ తరువాయి)**

దాఖలు చేసింది. దీనిపై సుదీర్ఘ విచారణ జరిపిన హైకోర్టు ప్రభుత్వ హామీని పరిగణనలోకి తీసుకుని స్టేను తాత్కాలికంగా నిలిపివేసింది. ద్వితీయ, తృతీయ, నాలుగవ సంవత్సరం విద్యార్థుల వివరాలను వారం రోజుల్లో సంబంధిత వెబ్‌సైట్‌లో కాలేజీలు అప్‌లోడ్ చేయాలని కోర్టు ఆదేశించింది. అనంతరం ప్రభుత్వం నిధుల విడుదల ప్రక్రియ పూర్తి చేసి జూలై 31లోగా ఆయా విద్యార్థుల ఫీజులను చెల్లించాలని స్పష్టం చేసింది. తొలి ఏడాది విద్యార్థుల ఫీజుల తొలి విడతను ఆగస్టు 15లోగా విడుదల చేయాలని పేర్కొంది. ఆ గడువు ముగిసిన తర్వాత కూడా ప్రభుత్వం చెల్లింపులు చేయకపోతే మాత్రమే కాలేజీలు విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేసుకునే అవకాశం ఉంటుందని కోర్టు స్పష్టం చేసింది. అడ్మిషన్ల ప్రక్రియ ఎలాంటి ఆటంకం లేకుండా కొనసాగించాలని కూడా ఆదేశించింది. ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది శ్రీరఘురామ్, ప్రత్యేక ప్రభుత్వ న్యాయవాది రాహుల్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ, రూ.250 కోట్ల విడుదల కేవలం కొత్త అడ్మిషన్లకే కాకుండా అన్ని సంవత్సరాల విద్యార్థుల ఫీజుల చెల్లింపు ప్రక్రియలో భాగమని తెలిపారు. తొలి విడత నిధులను విడుదల చేస్తున్నామని, మిగిలిన మొత్తాన్ని ఆగస్టు 15లోగా విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. అడ్మిషన్ల సమయంలో విద్యార్థులపై ఫీజుల భారం పడకుండా చూడడమే ప్రభుత్వ ఉద్దేశమని, ఫీజులు చెల్లించకపోతే అడ్మిషన్లు నిరాకరించడం వల్ల పేద విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటుందని వాదించారు. ఇతర సంవత్సరాల విద్యార్థుల ఫీజుల చెల్లింపులు కూడా ఈ నెలాఖరులోగా పూర్తి చేస్తామని కోర్టుకు వివరించారు. కాలేజీల తరపున సీనియర్ న్యాయవాదులు శ్రీరామ్, ఎల్. రవిచందర్, అవినాశ్ దేశాయ్ వాదిస్తూ, గత కొన్నేళ్లుగా వేల కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, 2020 నుంచి చెల్లించాల్సిన బకాయిలు ఇప్పటికీ విడుదల కాలేదని తెలిపారు. చదువు పూర్తి చేసి వెళ్లిపోయిన విద్యార్థుల నుంచి కాలేజీలు ఫీజులు ఎలా వసూలు చేయగలవని ప్రశ్నించారు. ప్రభుత్వం వరుసగా జీవో–7, జీవో–8, జీవో–9లను తీసుకొస్తూ కాలం గడుపుతోందని, దీని వల్ల కాలేజీలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. స్టేను ఎత్తివేస్తే కనీసం ఆగస్టు 19 వరకు ప్రభుత్వం చెల్లింపులకు గడువు ఇచ్చి, ఆ తర్వాత కూడా చెల్లించకపోతే ఆగస్టు 20 నుంచి విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేసుకునేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోర్టును కోరారు.

## పనులు (మొదటి పేజీ తరువాయి)

తెలుసుకున్నారు.ఈ సమావేశంలో ఎంఆర్‌డిసిఎల్ ఎం.డి. నర్సింహ్మారెడ్డి, జాయింట్ కమిషనర్ గౌతమి, జలమండలి ఎం.డి. అశోక్ రెడ్డి, ఇంజనీరింగ్ అధికారులు కె.సురేష్ కుమార్, సత్యనారాయణలు పాల్గొన్నారు. వరద నియంత్రణ చర్యలు, మురుగునీటి శుద్ధి వ్యవస్థల అనుసంధానం, భూసేకరణ, అభివృద్ధి పనుల సిద్ధ త, రివర్‌ఫ్రంట్ కారిడార్ మౌలిక వసతుల ప్రణాళికలపై విస్తృతం గా చర్చించారు. మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టు భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా దీర్ఘకాలిక దృష్టితో అమలు చేయాలని ప్రధాన కా ర్యదర్శి సంజయ్ జాజు సూచించారు. పర్యావరణ సమతుల్యతకు భంగం కలగకుండా శాస్త్రీయ విధానాలను అనుసరించాలని, సాం కేతిక ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని అధికారులను ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తేనే ప్రాజెక్టు ఆశించిన ఫలితాలు సాధిస్తుందన్నారు. మూసీ, ఈసీ నదుల మధ్య ప్రాంతం నుంచి గాంధీ సరోవర్ సంగమం వరకు ప్రత్యేక మాస్టర్‌ప్లాన్‌ను ఎంఆర్‌డిసిఎల్, హెచ్‌ఎండిఏ సంయుక్తంగా రూపొందించాలని సూచించారు. నదీతీర ప్రాంతంలో మెరుగైన అనుసంధా నం, ప్రణాళికాబద్ధమైన పట్టణాభివృద్ధికి ఇది దోహదపడుతుందని సంజయ్ జాజు అన్నారు. ప్రధాన కార్యదర్శి చేసిన సూచనలను ప్రాజెక్టు అమలులో పొందుపరిచి, తొలి దశ పనులను వేగవంతంగా పూర్తి చే సేందుకు చర్యలు తీసుకుంటామని ఎంఆర్‌డిసిఎల్ అధికారులు తెలిపారు.

## మెగా ప్లాన్(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం దశలవారీగా అమలు చేయనుంది. అయితే, ప్రస్తు తం మంజూరు చేసిన రూ. 7,345.12 కోట్ల నిధుల్లో భూసేకరణ వ్యయం చేర్చలేదు. కేవలం ప్రాజెక్టు పనుల కోసమే ఈ నిధులు ఖర్చు చేయనుండగా, ఆపరేషన్స్, మెయింటెనెన్స్ (ఓ అండ్ ఎం) కోసం అదనంగా 6 శాతం నిధులను కేటాయించారు. తొలి విడతలో భాగంగా మొత్తం 21 కిలోమీటర్ల మేర మూసీ నది పరివాహక ప్రాంతాన్ని ప్రాధాన్యతా ప్రాతిపదికన అభివృద్ధి చేయనున్నారు. దీనిని రెండు విభాగాలుగా వర్గీకరించారు. జోన్1ఏ (హిమాయత్ సాగర్ నుంచి బాపూఘాట్) వరకు. గాంధీ సరోవర్ బాపూఘాట్ వరకు 9.20 కిలోమీటర్ల మేర ఈ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. దీని అంచనా వ్యయం రూ. 3,232.01 కోట్లు. జోన్1బి (ఉస్మాన్ సాగర్ నుంచి బాపూఘాట్) వరకు. ఉస్మాన్ సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 11.80 కిలోమీటర్ల మేర పనులు చేపట్టనున్నారు. దీని అంచనా వ్యయం రూ. 4,113.11 కోట్లు.ఈ మెగా ప్రాజెక్టుకు అవసరమైన అంతర్జాతీయ ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం సాధించింది. ప్రాజెక్టుకు ప్రధాన బలంగా ఏడిబి రూ. 4,500 కోట్లు (500 మిలియన్ డాలర్లు) ఆర్థిక సహాయం అందించేందుకు అంగీకరించింది. మిగిలిన రూ. 2,845.12 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం, హెచ్‌ఎండిఏ, టిజిఐఐసిల ద్వారా రుణ రూపంలో సమకూర్చుకోనుంది.

**'ఈపిసి' పద్ధతిలో పనులు –పర్యవేక్షణకు పిఎంసి**

పనులలో నాణ్యత, పారదర్శకతకు పెద్దపీట వేస్తూ ఈ ప్రాజెక్టును ఈపిసి మోడ్‌లో చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంతర్జాతీయ బ్యాంక్ (ఏడిబి) మార్గదర్శకాలకు అనుగుణంగానే టెండర్ల ప్రక్రియ నిర్వహించనున్నారు. పనుల పర్యవేక్షణ, క్వాలిటీ కంట్రోల్ కోసం ఒక ప్రత్యేక ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ (పిఎంసి)ని నియమించేందుకు కూడా సర్కార్ ఆమోదం తెలిపింది. జీ.ఓ జారీ అయిన నేపథ్యంలో తదుపరి చర్యలను వేగవంతం చేయాలని మూసీ నది అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్‌డిసిఎల్) మేనేజింగ్ డైరెక్టర్‌ను ప్రభుత్వం ఆదేశించింది. ఈ ప్రాజెక్టు పట్టాలెక్కితే రాబోయే రోజుల్లో హైదరాబాద్ గ్లోబల్ సిటీగా సరికొత్త వైభవాన్ని సంతరించుకుంటుందని ప్రభుత్వం భావిస్తోంది.